క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మెరిట్ విద్యార్థులకు శనివారం రూ.40 వేలు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆశి పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి ప్రవాసాంధ్రుడు తిప్పన శంకరరావు రెడ్డి విద్యార్థులను ప్రోత్సాహిస్తూ వారికి నగదుతో పాటు పాఠశాల అభివృద్ధికి సాయం అందిస్తున్నారని అన్నారు. దాత తనయుడు కిరణ్ పాల్గొన్నారు.

అధికారిక లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు





పోలీసుల లాంఛనాలతో జరుగుతున్న అంత్యక్రియలు

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ తలగాపు శంకర్ (37) శుక్రవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. దీంతో శనివారం ఉదయం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శంకర్ శ్రీకాకుళం వెళ్లి విధులు నిర్వహిస్తూనే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూనే తుది శ్వాస విడిచారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అంత్యక్రియల్లో కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ పి.సూర్యానారాయణ, ఏఆర్ ఆర్ఐ ఎస్.శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి నివాళులు



చింతామణి దేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సోంపేట: జింకిభద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని చింతామణి దేవి పాడి శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో శనివారం పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రథమ ర్యాంకర్‌కు సన్మానం



నిరోషాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పరశురాంపురం గ్రామానికి చెందిన కురమాన నిరోషా పీజీటీ (సోషల్) విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఈమె స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. దీంతో పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులంతా ఆమెను సన్మానించారు. సర్పంచ్ కె.కామేశ్వరరావు, ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు, ప్రధానోపాధ్యాయురాలు రోజా, ఉపాధ్యాయుడు జి.ధనుంజయరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

దోమల వ్యాప్తి లేకుండా చర్యలు

టెక్కలి: మేజర్ పంచాయతీలో దోమల వ్యాప్తి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఈఓపీఆర్‌డీ సింహాద్రి తెలిపారు. శనివారం టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు చెరువులు, బావుల్లో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. సహాయ మలేరియా అధికారి శ్రీకాంత్, పంచాయతీ ఈవో ఎ.వి.శ్రీనివాస్ ఉన్నారు.

కళాశాల సందర్శన

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను జిల్లా వృత్తివిద్యాధికారి ఆర్.సురేష్‌కుమార్ శనివారం సందర్శించారు. తరగతుల నిర్వహణ, నీట్, ఎంసెట్ కోసం ప్రత్యేక క్లాసుల నిర్వాహణ, స్టడీమెటీరియల్ గురించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనంపై ఆరా తీశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ శరత్‌బాబు ఉన్నారు.

పనుల్లో జాప్యం.. రైతుల్లో కలవరం!

- రావివలస చెరువు గట్టు రోడ్డు పనుల్లో జాప్యం
- పంట పొలాలకు పొంచిఉన్న ముంపు ప్రమాదం



రావివలస పెద్దచెరువు గట్టుకు ఇరువైపులా పొలాల్లోకి కుంగిపోయిన మట్టి

టెక్కలి: కూటమి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అరకొర పనులు సైతం నత్తనడకన కొనసాగుతున్నాయి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. దీనికి టెక్కలి మండలం రావివలస గ్రామంలోని పెద్ద చెరువు గట్టు మీద నుంచి మల్లన్న ఆలయం వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఉదాహరణగా చెప్పవచ్చు. అధికారుల నిర్లక్ష్యం, పనుల్లో చోటు చేసుకున్న జాప్యంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పెద్ద చెరువు గట్టుపై వేస్తున్న సీసీ రోడ్డు పనుల్లో జాప్యం చోటు చేసుకోవడంతో ఇటీవల కాలంలో రోడ్డుకు ఇరువైపులా మట్టి కుంగిపోయి పంట పొలాల్లో చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు



పెద్ద చెరువు గట్టుపై నిలిచిపోయిన రోడ్డు పనులు

చెరువుకు గండి ఏర్పడితే తమ పంట పొలాలన్నీ ముంపునకు గురికాక తప్పదంటూ రైతులంతా ఆందోళన చెందుతున్నారు. సాక్ష్యాత్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ గ్రామానికి ప్రకటించిన పనుల్లో భాగంగా ప్రస్తుతం ఈ సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనుల్లో జాప్యం చోటు చేసుకుంది. ఈ ప్రభావం వలన రైతులకు భారీ నష్టం ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికైన అధికార యంత్రాంగం స్పందించి పెద్ద చెరువుకు గండి ఏర్పడి పంట పొలాలు ముంపునకు గురి కాక మునుపే రోడ్డు పనులు పూర్తిచేసే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు నష్టం లేకుండా చూడాలి



గ్రామంలో పెద్ద చెరువు గట్టుపై చేస్తున్న సీసీ రోడ్డు పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలి. ముఖ్యంగా చెరువుకు గండి ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎటువంటి నష్టం లేకుండా పనులు పూర్తి చేస్తే మంచిది.

–సర్లాన బాలకృష్ణ, సర్పంచ్, రావివలస, టెక్కలి మండలం

ఆవులు, కుక్కలు, కోతుల సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

- ఇచ్ఛాపురం మున్సిపల్ సమావేశంలో సభ్యులు



సమస్యలపై మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న ఆవులు, కుక్కలు, కోతుల సమస్యను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, ఒకటవ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్‌తో పాటు పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశం మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. 14 అంశాలతో కూడిన అజెండాపై చర్చ జరిగింది. మూడో వార్డు ఏఎస్‌పేట వద్ద ఈస్ట్ ఇండియా ట్రాన్స్‌పోర్టు కంపెనీ వారు మున్సిపాలిటీకి 7,99,121 బకాయి పడ్డారు. అయితే ఈ కంపెనీకి చెందిన భూభాగమంతా మండలంలో మునిబద్ర గ్రామం పరిధికి చెందినది కావడంతో ఆన్‌లైన్‌లో గల ఈ బకాయిని రద్దు చేయాలని మున్సిపల్ అధికారులు అజెండాలో పెట్టారు. దీంతో పలువురు సభ్యులు దీన్ని తప్పుబట్టారు. అనేక సంవత్సరాలుగా పన్ను వసూలు చేస్తున్నారని.. ఇప్పుడు ఎందుకు రద్దు చేయడంలో మర్మమేమిటో చెప్పాలని నిలదీశారు. దీనికి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి కల్పించుకొని ఈ అంశాన్ని తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. పట్టణ ప్రజలకు అవసరమైన రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టకుండా రూ. 11.50 లక్షలతో మున్సిపాలిటీకి సుందరీకరణ అవసరమేముందని వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి డీసెంట్‌నిచ్చారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. కోతులు, కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని, మూగజీవాలు కారణంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం జారీచేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమం నిర్వహించేటప్పుడు ఎటువంటి పదవీ, హోదా లేనివారంతా కలుగజేసుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వైస్ చైర్‌పర్సన్-1 ఊలాల భారతిదివ్య మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జనరల్ ఫండ్ పనులు ఎప్పుడు మొదలవుతాయని, ఇప్పటికే చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని 23వ వార్డు కౌన్సిలర్ జి.ప్రదీప్ ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

- వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం సమన్వకర్త పిరియా విజయ



మాట్లాడుతున్న సమన్వయకర్త విజయ

సోంపేట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో సోంపేటలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ నెల పార్టీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు, పార్టీ నాయకుల ఇబ్బందులను మండల, నియోజకవర్గ నాయకుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారాని కృషిచేద్దాం అన్నారు. నాయకులందరూ ఐకతగా ఉంటూ మండలంలో పార్టీ బలోపేతం చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే పథకాలు చాలా మందికి అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదని, అలాంటి వారిని గుర్తించి అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీపీ నిమ్మన దాస్ మాట్లాడుతూ.. ప్రతీ పంచాయతీలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్‌లు తడక జోగారావు, యర్ర రజని, బట్టి మాధవరావు, పొందూరు గున్నయ్య, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, దున్న మాధవవరావు, పిన్నింటి ఝాన్సీ, రేఖారావు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు



వజ్రపుకొత్తూరు: ఉద్దానం రామక్రిష్టాపురంలో ఎడ్ల బండిపై నిమజ్జనం కోసం తరలి వెళ్తున్న గణనాథుడు

వజ్రపుకొత్తూరు: వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఉద్దానం ప్రాంతంలో శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన భక్తులు సంప్రదాయబద్ధంగా ఎడ్ల బండ్లపై వినాయక విగ్రహాలను తీసుకొని వెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఉద్దానం రామక్రిష్టాపురం, పీఎంపురం, అమలపాడు తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

25 రకాల నైవేద్యాలతో నివేదన

కవిటి: బెజ్జిపుట్టుగ బార్లవీధిలో వరసిద్ధి వినాయక చవితి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వాహకులు ఈ ఉత్సవాలు 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గణనాథునికి 25 రకాల నైవేద్యాలతో ప్రసాదాన్ని నివేదన చేసి అన్నదానం చేశారు. అలాగే కొత్తపుట్టుగ స్కూల్‌వీధిలోని మండపం వద్ద లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా.. రూ.77 వేలకు నర్తు ఢిల్లయ్య ,ప్రసాద్, శివాజీలు దక్కించుకున్నారు. మరో లడ్డూను రూ. 55 వేలకు తరిణమ్మ కుటుంబం సొంతం చేసుకోగా.. దూగానపుట్టుగలో లడ్డూను తోట గంగారావు రూ.65 వేలకు దక్కించుకున్నారు.



కొత్తపుట్టుగలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న వారితో కమిటీ సభ్యులు

జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, క్వెస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. టాటా, ఎంఆర్‌ఎఫ్, భారత్ బయోటెక్, స్పైడర్ తదితర కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాకు 65 మంది హాజరవ్వగా.. విద్యార్హత, ప్రతిభ ఆధారంగా 42 మందిని ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఝాన్సీ రాణి, జయంత్, పావని, కామర్స్ అధ్యాపకులు పి.వెంకటరమణ, జి.కసవయ్య పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణులకు అభినందన



క్రీడాకారిణులను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: క్రీడా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్-2025 రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన మున్సిపల్ బాలికోన్నత పాఠశాల క్రీడాకారిణులు జిల్లా ఖోఖో జట్టుకి ప్రాతినిధ్యం వహించి రెండవ స్థానంలో నిలిచారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 50 వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి క్రీడాకారిణులను అభినందిచారు. కార్యక్రమంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్, సీఐ చిన్నంనాయుడు, వైస్ చైర్‌పర్సన్-1 ఉలాల భారతిదివ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేత బొరివంక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో కవిటి మండలం బొరివంక ఉన్నత పాఠశాల విజేతగా నిలిచింది. స్థానిక బేతాళ యువజన సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ద్వితీయ, తృతీయ స్థానాలను హరిపురం ప్రాంతానికి చెందిన గీతం పబ్లిక్ స్కూల్, బొయితిపుట్టుగకు చెందిన గాయత్రి పబ్లిక్ స్కూల్ జట్లు కై వసం చేసుకున్నాయి. అలాగే జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు డి.అనురాధ (మున్సిపల్ హైస్కూల్-ఇచ్ఛాపురం), దున్న గాయత్రీ(హైస్కూల్-డొంకూరు), బి.అశ్వినీ (సత్యసాయి హైస్కూల్-ఎం.తోటూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నారు. విజేతలకు ఎంఈఓ-2 ఎస్.విశ్వనాథం, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానందరెడ్డి, సర్పంచ్ నర్తు ప్రేమ్‌కుమార్, యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఇచ్ఛాపురం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక జూనియర్ కోర్టు సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహలతో చేకూరే నష్టాలను జడ్జి వివరించారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సైలు ముకుందరావు, రవివర్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎస్.ఎల్.నారాయణ, సోమశేఖర్‌రెడ్డి, నారాయణ, సీతయ్యరెడ్డి, సత్యన్నారాయణపాఢీ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. టెక్కలి మండలం సవర ముఖలింగాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక చట్టంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల తరువాతే ఆడపిల్లలకు వివాహాలు చేయాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, సర్పంచ్ బి.రాకేష్, న్యాయవాది పి.ఆనంద్, ఎస్సై పి.రఘునాథరావు, ఎంఈవోలు డి.తులసీరావు, డి.చిన్నారావు, ప్రసూతి వైద్యురాలు ఎం.ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

– టెక్కలి

నృత్య ప్రదర్శన



ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగలో వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షలను అలరించాయి. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వెంకటేశ్వర డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలను చిన్నారులు కడురమ్యంగా ప్రదర్శించి అభినందనలు అందుకున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

ఏరోస్పేస్ సదస్సులో టెక్కలి విద్యార్థినులు



విశాఖలో ఈ నెల 29న నిర్వహించిన అంతర్జాతీయ ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్ సదస్సు, ప్రదర్శన కార్యక్రమానికి టెక్కలి బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభారాణితో కలిసి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులు సదస్సులో పాల్గొని ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయా వివరాలను కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, లెర్నింగ్ లింక్ ఫౌండేషన్ హెడ్ సుధతో పాటు నిర్వాహకులకు వివరించారు.

– టెక్కలి

ఎమ్మెల్సీ పరామర్శ

కవిటి: కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ తల్లి కృష్ణవేణి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, కవిటి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్‌లు శనివారం ఆయన కుటుంబాన్ని కవిటిలో పరామర్శించారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు చేయాలి



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ బోర పుష్ప

కంచిలి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన పనులపై ప్రభుత్వం ప్రణాళికలు చేయాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ మండల స్థాయి వర్క్‌షాపును శనివారం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల్లో అవసరాలకు ప్రణాళిక రూపొందించాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కె.అప్పలస్వామి చెప్పారు. డిప్యూటీ ఎంపీడీవో జి.వీరభద్రస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి గ్రామ పంచాయతీ పురోగతి, సుస్థిరత సాధించేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బోర పుష్ప అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0, 2-23-24 ఆర్థిక ఏడాదికి సంబంధించి సమావేశంలో పాల్గొన్నారు. పంచాయతీ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి ప్రగతికి సంబంధించి ప్రత్యేక అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీర్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఎంపీడీవో కె.రామారావు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు పాల్గొన్నారు.



కవిటి: శిక్షణ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

కవిటి: ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతోనే పంచాయతీలు, ప్రాదేశికాల అభివృద్ధి సాధ్యమని ఈవోపీఆర్డీ వరప్రసాద్, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన వివిధ విభాగల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శిబిరాన్ని సందర్శించారు.

సోంపేట: పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈవోపీఆర్డీ వెంకటరావు పాల్గొన్నారు.